అధ్వానంగా వ్యర్థాల నిర్వహణ

- నిర్లక్ష్యం నీడలో బాపట్ల ఏరియా వైద్యశాల
- ఎక్కడపడితే అక్కడ పారేస్తున్న ఆసుపత్రి వ్యర్థాలు

బాపట్ల: ఇదేం దవాఖానా రా బాబు... వచ్చిన రోగం తగ్గకపోగా... కొత్త రోగాలు పుట్టుకొచ్చే విధంగా ఉన్నాయ్ అన్న చందంగా మారింది బాపట్ల ఏరియా వైద్యశాలలో వ్యర్థాల నిర్వహణ. అసలు వైద్యశాల అంటే ఏమిటీ... ఏఏ విధులు నిర్వహించాలి... ఎలా నిర్వహించాలి... సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు ఏంటి అనే విషయాలను కూడా ఇక్కడి సిబ్బందికి ఎవరూ చెప్పినట్లు లేరు. కనీసం తెలుసుకోవాలనే ఆలోచన కూడా వారికి లేనట్లుంది. వారి నిర్లక్ష్యం వివిధ అవసరాల నిమిత్తం వైద్యశాలకు వచ్చే రోగులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది.

పర్యవేక్షణ లోపం కారణంగా

బాపట్ల ఏరియా వైద్యశాలలో రోగులకు వాడిన సిరంజిలు, సూదులు తదితర వ్యర్థాలను సంబంధిత వ్యర్థ పదార్థాల డబ్బాలో మాత్రమే వేయాలి. వాటిని బయటకు తీసే సమయంలో కూడా చుట్టుపక్కల ప్రజలు ఎవరూ లేకుండా మూటకట్టి వాటి సేకరణ నిమిత్తం వచ్చే కాలుష్య నియంత్రణ మండలి వాహనంలో వేయాల్సి ఉంది. పర్యవేక్షణ లోపం కారణంగా వైద్యశాలలోని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. వైద్యశాలకు నిత్యం రోగులు చంటి బిడ్డలను సైతం వెంటపెట్టుకొని వస్తుంటారు. ఏమీ తెలియని పసికందులు వాటిని తీసుకోవడం, వాటితో ఆడుకుంటున్న ఘటనలు అనేకం లేకపోలేదు. ఇలా చేయటం వలన అత్యంత ప్రమాదకరమైన వ్యాధులు, హైపటైటిస్-బీ, సీ, హెచ్ఐవీ వంటివి సోకే ప్రమాదం ఉంది. వైద్యశాలలో వచ్చే ప్రమాదకర వ్యర్థాలను సంబంధిత డబ్బాల్లో నిల్వ చేసినప్పుడు మాత్రమే అంటురోగాలు సోకకుండా ఉంటాయనేది కాలుష్య నియంత్రణ మండలి నిబంధన. ఐతే అదే తరహాలో ఏఏ రంగు డబ్బాల్లో ఎలాంటి వ్యర్థాలు నిల్వ చేయాలో కూడా సంబంధిత సిబ్బంది శిక్షణ తరగతులు నిర్వహించి మరీ చెప్పారు. చెప్పడమే కాకుండా ఫొటోలతో కూడిన చార్టులను కూడా అందజేశారు. అయితే వీటితో మాకేంటి పని... అన్న చందంగా వాటిని పక్కన పడేసి... వాళ్లకిష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. వైద్యశాలలో ఎలాంటి ప్రమాదకర వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 'బయో హజార్డ్స్' పేరుతో ప్రతి వైద్యశాలకు కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది ఐదు రకాల డబ్బాలను అందజేశారు. అవి ఇలా...


వ్యర్థాలను అన్నీ ఒకే డబ్బాలో పడేసిన సిబ్బంది

- ప్రమాదకరమైన ఇంజెక్షన్ సూదులు, ఇంజెక్షన్ వాయిల్స్, సూక్ష్మదర్శినిలో వాడే స్లైడ్లు, ఆపరేషన్‌లో ఉపయోగించే సూదులు, బ్లేడ్లు, పదునైన కత్తులు, గాయపరిచే ఏ పదునైన వస్తువులనైనా సోడియం హైపోక్లోరైట్ ద్రవంతో కలిపి తెలుపు రంగు డబ్బాలో నిల్వ చేయాలి.
- రోగికి వాడిన ప్లాస్టిక్ సిరంజిలు, రక్తపు సంచులు, చేతి తొడుగులు, గ్లౌజులు, డయాలసిస్ సామగ్రి, మూత్రపు సంచులు, ఐవీ సెట్స్‌తో పాటు అన్ని రకాల రబ్బర్, ప్లాస్టిక్ వ్యర్థాలన్నిటినీ బ్లీచింగ్ ద్రవంతో కలిపి ఎరుపు డబ్బాలో వేయాలి.
- మానవ శరీర భాగాలైన మావి, గర్భాశయం, అపెండిక్స్, ప్రమాదకరమైన కంతులు, వ్యాధి నిర్ధారణ కణజాల నమూనాలు (బయాప్సీ పదార్థాలు), సిమెంట్ పట్టీలు, డ్రసింగ్ ప్యాడ్‌లు, దూది, చీము రక్తంతో తడిచిన బ్యాండేజిలు తదితర వ్యర్థ పదార్థాలను పసుపు రంగు డబ్బాలో వేయాలి.
- కాలం చెల్లిన మందులు, పనికిరాని సిరప్‌లు, విషతుల్య మందు పదార్థాలు నలుపు రంగు డబ్బాలో వేయాలి.
- పండ్లు, కూరగాయ తొక్కలు, కాగితాలు, ప్లాస్టిక్ క్యారీబ్యాగులు, డిస్పోజుబుల్ గ్లాసులు, పేట్లు, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, వంటగది వ్యర్థాలను ఆకుపచ్చ డబ్బాలో వేయాలి.

చర్యలు తీసుకుంటాం



వైద్యశాలలో రోగుల ఉపయోగించిన అనంతరం వచ్చే వ్యర్థాలను సంబంధిత డబ్బాల్లో మాత్రమే వేయాలి. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. అలా చేయటం చాలా ప్రమాదకరం. ఆరోగ్యవంతులకు కూడా ప్రమాదకరమైన వ్యాధులు సోకే అవకాశం ఉంది.

–డాక్టర్ సిద్దార్ధ, సూపరింటెండెంట్

పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు మేలు చేస్తాం

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు


అబ్బనగూడవల్లి పార్టీ అధ్యక్షుడు నిరీక్షణరావుతో వరికూటి అశోక్‌బాబు

అబ్బనగూడవలి(వేమూరు): పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు మేలు చేయడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు తెలిపారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కనపర్తి నిరీక్షణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా నిలబడటం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలను పూర్తిగా మోసం చేశాడని, మహిళలు చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. పాఠశాలలు అధ్వానంగా మారుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు పోటీగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు, గ్రామ సర్పంచ్ రాంబాబు, గోళ్ల మంత్రయ్య, కొండిశెట్టి వెంకట్రావు, బొద్దలపాటి సుబ్బారావు, కనపర్తి యేసియ్య, బొరుగడ్డ రాజా, గోళ్ల పసి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లపర్రు అగ్రహారంలో వరి కుప్ప దగ్ధం


దగ్ధమైన వరి కుప్పను పరిశీలిస్తున్న డాక్టర్ గణేష్, నాయకులు

నగరం: వరి కుప్ప దగ్ధమైన ఘటన శనివారం రాత్రి మండలంలోని సజ్జావారిపాలెం పంచాయతీ పరిధిలోని అల్లపర్రు అగ్రహారంలో జరిగింది. స్థానికులు, ఎస్ఐ బండ్ల భార్గవ్ సమాచారం మేరకు షేక్ ఖాజావలికి చెందిన అర ఎకరం వరికుప్పను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. వరి కుప్ప దగ్ధం విషయం తెలుసుకున్న బాధితుడు ఖాజావలి అక్కడకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట బూడిద పాలైందని ఆవేదన వ్యక్తం చేశాడు. సమాచారాన్ని పోలీసులకు తెలపడంతో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

ఖాజావలిని పరామర్శించిన డాక్టర్ గణేష్

సజ్జావారిపాలెం శివారు అల్లపర్రు అగ్రహారంకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ ఖాజావలి వరి కుప్ప దగ్ధమవ్వడంతో ఘటన స్థలాన్ని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పరిశీలించారు. బాధితుడు ఖాజావలిని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అధైర్య పడాల్సిన అవసరం లేదని పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నిజాంపట్నం కోటేశ్వరావు, జిల్లా డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ తోకల రాజా, నగరం ఎంపీటీసీ సభ్యుడు ఉప్పాల వెంకటేశ్వరావు, చెరుకుపల్లి మండల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, నాయకులు ఎస్.సురేష్, కె.సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల ఎంపిక

కొల్లూరు : వైఎస్సార్‌సీపీ నూతన గ్రామ కమిటీల ఎంపిక సోమవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. మండలంలోని చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతర్లంక, పెదలంక, పెసర్లంక గ్రామాల నూతన కమిటీలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. చిలుమూరు లంకలో సాయంత్రం 4 గంటలకు వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో పార్టీ కమిటీల నియామకం ఉంటుందన్నారు.

చుండూరులో ఉచిత వైద్య శిబిరం



చుండూరు(వేమూరు): అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఆర్థోపెడిక్ వైద్యులు మర్రెడి శివారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని శివాలయం సెంటర్‌లో ఆదివారం గుంటూరుకు చెందిన లక్ష్మీకస్తూరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చర్మ వైద్య నిపుణురాలు గుత్తికొండ అఖిల సాయి పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పక వేయించాలి

మండల పశు వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న

చెరుకుపల్లి: మండలంలోని పశు పోషకులందరు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న తెలిపారు. మండలంలోని గూడవల్లి, కుంచలవారి పాలెం, యేమినేని వారి పాలెం, రాంబొట్లవారి పాలెం పంచాయతీల పరిధిలో ఆదివారం పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ ఈ గాలికుంటు వ్యాధి టీకాలు మార్చి 1వ తేదీ నుంచి 31 వరకు పశువులకు వేయటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనారోగ్య బాధితుడికి పరామర్శ



చుండూరు(వేమూరు): అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను ఆదుకోవడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామానికి చెందిన కుక్కల రామకృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ పొన్నూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం వరికూటి అశోక్‌బాబు వైద్యశాలకు వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలికలు విద్యతో పాటు ఆటల్లోనూ చురుగ్గా ఉండాలి

ఎస్ఐ రవికృష్ణ



వేమూరు: బాలికలు విద్యతో పాటు ఆటల్లోనూ చురుగ్గా ఉండాలని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థినులకు ఆదివారం యోగ, ఆటల పోటీలు నిర్వహించారు. బీసీ బాలికల హాస్టల్ బాలికలతో ఆటలు ఆడించడం జరిగిందన్నారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ కానిస్టేబులు, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఉదయాన్నే భక్తులు కొండను ఎక్కి తల నీలాలు సమర్పించారు. అనంతరం కార్మెల్ మాత స్వరూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. దిగువ భాగంలోని ఆరోగ్యమాత స్వరూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తెనాలిలో రామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి

ఈనెల 9–14 తేదీల్లో టీజే హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహణ

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ అంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం జరగనుంది. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి ఆరురోజులపాటు జరిగే ఈవేడుకకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. 2022 డిసెంబరు 25న ప్రారంభించిన అష్టోత్తర శతకోటి (108) శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞంలో రాష్ట్రవ్యాప్తంగానూ, ఇతర రాష్ట్రాల్లోని భక్తులు పాల్గొన్నారు. పారాయణ పూర్తయిన నేపథ్యంలో కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ ప్రాంగణంలో వైఖానసాగమోక్తంగా పూర్ణాహుతి మహాయజ్ఞం తలపెట్టినట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈనెల తొమ్మిదో తేదీ నుండి 14వ తేదీ వరకు జరిగే మహాయజ్ఞంలో ప్రతిరోజు విశేష హోమాలు, కళ్యాణాలు, ఉచిత సామూహిక పూజలు, ఆధ్యాత్మికవేత్తల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో భగవత్ రామానుజ దాసుడు సహకారంతో ఎంతో వైభవంగా జరిగే అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ పూర్ణాహుతి మహోత్సవంలో భక్తజనావళి విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి, హరిప్రసాద్, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ,ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, సభ్యులు జంజం రామారావు, ఉప్పల వరదరాజులు, మూర్తి వెంకటేశ్వర రావు, మదుపల్లి చంద్రశేఖర్ ,గుడివాడ బాలకృష్ణ, రొంపిచర్ల సురేష్, గుంటి వెంకట్, శ్రీరామ్ రాజేష్ బాబు, మాజేటి వెంకటేష్ ,కోట బద్రి నారాయణ , గోలి సోమశేఖర్, కే రాజశేఖర్, కె హరీష్ తదితరులు పాల్గొన్నారు


బ్రోచర్ ఆవిష్కరించిన ఈవో అవుతు శ్రీనివాసరావు, నిఖిల్ శాండిల్య ప్రభృతులు

పశువులకు గాలికుంటు టీకా

ఫిరంగిపురం: వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో ఆదివారం పశు వైద్యశాల సిబ్బంది ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి టీకా వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నుదురుపాడులో పశువులకు టీకా వేసామని చెప్పారు. పశువైద్య సిబ్బంది పశువులు ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వాటి వివరాలు నమోదు చేసుకొని టీకా వేస్తారని చెప్పారు. వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో 7 ఆవులు, 127 గేదెలకు టీకా వేసినట్లు చెప్పారు. ఆయన వెంట లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్ .వినీల, సిబ్బంది ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో ఫాల్గుణ మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, గుంటూరు ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫాల్గుణ మాసం, హోళీ పూర్ణిమను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సృష్టి ఆదిలోనే ఆకాశవాణిగా ఆదిత్యునికి బోధచేయబడినదే గీతా సారమని, తిరిగి ద్వాపర యుగంలో భగవానుడైన శ్రీకృష్ణుడు భక్తుడైన అర్జునునికి గీతోపదేశం చేశాడని వివరించామని తెలిపారు. కమిటీ సభ్యులు బి.శివలింగం నాయక్, ఆర్.తిరుపతి రావు, హరిబాబు, సుబ్బారావు, శివ, అరుణ, దిల్‌షా, చంద్రగౌరీ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో అభద్రతా భావం

దుగ్గిరాల: కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లుతో ముస్లిం సమాజంలో అభద్రత భావం ఏర్పడిందని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు ఎస్కే సుభానీ అన్నారు. ఆదివారం ముర్తుజా నగర్‌లో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వక్ఫ్ చట్టంపై ప్రభుత్వ చట్ట సవరణపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయన్నారు. తమ పూర్వీకులు కష్టజీతంతో కొంత మసీద్‌లు, మదర్సాలు, అనాథ ఆశ్రమాలు నిర్వహణకు ఆస్తులు దానం చేసినట్లు చెప్పారు. ఈ నూతన చట్ట సవరణ అమలులోకి వస్తే అవన్ని కోల్పోతామని, ఎన్‌డీఏ ప్రభుత్వం భాగస్వామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు ముస్లిం పెద్ద అన్నగా ఉంటానన్నా వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. మార్చి 10న జరిగే రెండు దఫా బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్న ఈ బిల్లును ముస్లిం మనోభావాలను గౌరవించి టీడీపీ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొన కూడదని తెలిపారు. సమావేశంలో మైనార్టీ నేతలు ఎస్కే రషీట్ సాహెబ్, ఎస్కే బాజీబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్కే సుభాని

నడవడికలో మార్పు రావాలి

రౌడీషీటర్లతో డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: రౌడీషీటర్ల నడవడికలో తప్పనిసరిగా మంచి మార్పు కనబడాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఎస్పీ బి.జనార్దనరావు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ ఆదివారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించారు. పౌరుల బాధ్యతల గురించి వివరిస్తూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ గురించి వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వివాదాలు, ఘర్షణలు, సెటిల్మెంట్లు వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే సహించబోమని స్పష్టం చేశారు. బుద్ధిగా మసలుకోకుంటే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించేదిలేదన్నారు. ప్రవర్తన మార్చుకోని వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి అలజడులు సృష్టించడం వంటివి చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అధికారులు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రౌడీషీటర్లు ప్రతి ఆదివారం సంబంధిత స్టేషన్‌లో హాజరుకావాలన్నారు. రౌడీషీటర్లకు మార్గనిర్దేశకాలు జారీ చేశారు. ఇతర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వారిపై నగర బహిష్కరణ వేటు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి రౌడీషీటరుపై పోలీసు నిఘా ఉంటుందని, ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ వెంట సీఐ ఎస్. రమేష్‌బాబు ఉన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ రమేష్‌బాబు

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి టౌన్ : రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోతున్నాయన్నారు. ఆప్కాస్ విధానాన్ని తొలగించి కార్మికులను కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద, మార్చి 6న విజయవాడలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వర రావు, నాయకులు రాచకొండ శివ, హరిబాబు, మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

తెనాలిటౌన్: తెనాలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీనియర్ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి సూచించారు. స్థానిక సుల్తానాబాద్‌లోని జేఎంజే కళాశాల ఎదుట కొత్తగా ఏర్పాటు చేసిన విజయశ్రీ హాస్పిటల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. 35 సంవత్సరాలుగా తెనాలి, పరిసర ప్రాంత ప్రజలకు సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్న గార్లపాటి విజయ్‌బాబు విజయశ్రీ హాస్పిటల్ ద్వారా మరింతగా మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల వెంకటరమణ, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, డాక్టర్ పి.హదస్సా తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీనియర్ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి

అధ్వాన్న రహదారితో అవస్థలు

విరిగిన అక్కిలేరు వంతెన వద్ద సైడ్‌వాల్


కంకర రాళ్లతో అధ్వాన్నంగా సజ్జావారిపాలెం రహదారి


సైడ్‌వాల్ విరిగిపోవటంతో ప్రమాదభరితంగా ఉన్న అక్కిలేరు వంతెన

రేపల్లె రూరల్: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా రహదారుల నిర్మాణం మాట దేవుడెరుగు కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. రేపల్లె నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి పండుగ నాటికే ప్రధాన రహదారుల పనులు పూర్తి చేయాలని ఆర్భాటంగా ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు ఆచరణకు నోచుకోలేదు. రేపల్లె నుంచి సజ్జావారిపాలెం మీదగా నగరం, నిజాంపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉంది. గుంతలమయంగా ఉన్న రహదారిని మరమ్మతులు నిర్వహించేందుకు రెండు నెలల క్రితం తవ్వి వదిలేశారు. దీంతో పెద్ద పెద్ద కంకర రాళ్లు బయటపడటంతో పాటు వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో విపరీతంగా దుమ్ము లేచి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. ఆదమరచి ప్రయాణం సాగిస్తే వాహనాలు జారి చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. దీంతో పాటు అక్కిలేరు వంతెన వద్ద ఉన్న సైడ్‌వాల్ శిథిలావస్థకు చేరి దెబ్బతినటంతో ఆ ప్రాంతంలో ప్రయాణం అత్యంత ప్రమాదభరితంగా ఉంది. రహదారి గుంతలమయంగా, కంకర రాళ్లతో ఉండటం, వంతెన వద్ద సైడ్‌వాల్ దెబ్బతిని ఉండటంతో నిత్యం ఆ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకోవటం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి త్వరితగతిన రహదారి మరమ్మతులు నిర్వహించటంతో పాటు వంతెన వద్ద సైడ్‌వాల్ ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రశాంతంగా టైప్ రైటింగ్ పరీక్షలు

రేపల్లె రూరల్: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైప్ రైటింగ్ పరీక్షలు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. పరీక్షలకు 40 మంది హాజరుకావాల్సి ఉండగా 39 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరైనట్లు టైప్ రైటింగ్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఇంగ్లీష్ లోయర్ గ్రేడ్‌కు 21 మంది హాజరు కావాల్సి ఉండగా 20 మంది, ఇంగ్లీష్ హయ్యర్ గ్రేడ్‌కు 15 మంది, తెలుగు లోయర్ గ్రేడ్‌కు ఒక్కరు, తెలుగు హయ్యర్‌కు ముగ్గురు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

